# బాబోయ్...ఇదే బావుంది!

రాజా

**పక్షులు ఆకాశంలో ఎగురుతూ ఉంటే వెనక నుంచి భూపాలరాగం వినిపించటం లాంటి హడావుడి, హంగు, ఆర్భాటం లాంటివేవీ లేకుండా పరమరొటీన్‌గా తెల్లవారింది. అందుకు నిదర్శనం సుందరాచార్య పిచ్చిపిచ్చిగా పాడుకుంటూ, మధ్యమధ్య స్వంత వ్యాఖ్యానాలు చేరుస్తూ పేపర్ చదువుకోవటమే...**

"అమ్మ నీ తీయనీ దెబ్బ...
ఇవాళ పేపర్లో వార్తలేంటబ్బా!?
పురుషుల్లో పుంగవా....
గాలీ తీసిన బుంగవా...
అమ్మనీ తీయనీ దెబ్బ...
ఇవాళ పేపర్లో వార్త లేంటబ్బా!?"

అంటూ వార్తలతో కలబడిపోయే కార్యక్రమంలో తెగ బిజీగా ఉన్నాడతను.

"తప్పిపోయిన వారి ప్రకటనలు...హుం... తప్పిపోయిన వారెక్కడైనా నేను తప్పిపోయాను అంటూ ప్రకటనలు ఇస్తారా? తప్పిపోయినవారి కోసం ప్రకటనలు అని ఉంటే బావుండేది" 'బాబూ నీవు ఇల్లు వదిలివెళ్ళిన దగ్గిర్నుంచి మీ అమ్మ బిపీ నార్మల్‌కు వచ్చింది. మీ నాయనమ్మ తిక్కతిక్కగా మాట్లాడటం మానేసి ఇపుడు అందర్నీ గుర్తుపడుతోంది. తరచుగా నాకు వచ్చే గుండెదడ కూడా తగ్గిపోయింది. కనుక నీవెక్కడున్నదీ మాకు తెలియపరుస్తే మరికొంత కాలం పాటు నువ్వు అలా అలా తిరిగి రావటానికి కావలసిన డబ్బు అప్పోసప్పో చేసి పంపగలను...ఇట్లు మీ నాన్న'

"అహా బహు విచిత్రంగా ఉందే ఈ ప్రకటన...ఇది ప్రకటన కాదు వికటన" అంటూ మరో పేజీమీదకి దండెత్తాడు.

అంతే ....భూమికి గురుత్వాకర్షణశక్తి ఓ క్షణం సేపు పోయి మళ్ళీ తిరిగొచ్చేసినట్టు ఒక్కసారిగా ఎగిరిపడ్డాడు. అందుక్కారణం సదరు మరోపేజీలో కనిపించిన ఇంకో ప్రకటన.

"ఆహా...భలేఛాన్స్...ఈ దెబ్బతో మారిపోతుంది నా జాతకం... ఇంకా ఆలస్యం చేస్తే అది మహాపాతకం" అనుకున్నాడు. గబగబా లేచి క్రాపు సర్దేసుకున్నాడు.

"నాగమణీ...ఓ నాగమణీ...త్వరగా రావే నా రమణీ" అంటూ కేకేశాడు భార్యని.


"ఏంటండీ పొద్దున్నే ఆ గావుకేకలు... మీర్రాసిందేదైనా పడిందా ఏంటి కొంప దీసి"అంటూ లోపల్నుంచి వచ్చింది నాగమణి.

"ఓసి పత్నీధర్మ...నన్నర్థం చేసుకోవేంటే నా ఖర్మ" అంటూ నెత్తికొట్టుకోబోయాడు. క్రాఫ్ చెరిగిపోతుందని మానేశాడు.

ఆమెకివన్నీ కొత్తేం కాదు. ధర్మపత్ని అని సంబోధించకుండా పత్నీధర్మ అన్నాడంటే ఆ పక్కన వచ్చే 'ఖర్మ'కి ప్రాస అని కాలరెగరేస్తాడని తెలిసి ఆ విషయం రెట్టించకుండా "ఎందుకు పిల్చారో చెప్పండి" అని అడిగింది.

"చూడు ఈ ప్రకటన...అతి త్వరలో జరగబోతోంది ఓ మహత్తర బృహత్తర సంఘటన"అంటూ చదివి వినిపించాడు.

"కావలెను. సరికొత్త కథలు చెప్పగల రచయితలు కావలెను. కథల్లేక కదల్లేని స్థితిలో ఉన్న సినీ పరిశ్రమకు ఓ కొత్త ఊపునివ్వడానికి, పాతకథకైనా సరే సరికొత్త రూపునివ్వగల కథారచయితలు కావలెను. ఎదురింటిజాణ - పక్కింట్లో బిచాణా, సాల్లే బే సాలే, రక్షలు రక్షలు పాదరక్షలు వంటి సిల్వర్ జుబ్లీ చిత్రాలు తీసిన దర్శకజంట అంకుశం-పరాంకుశం నగరానికి విచ్చేసిన సందర్భంగా నూతన రచయితలకు ఆహ్వానం...కలుసుకొనగోరువారు హోటల్ త్రిశోకా రూమ్‌నెంబర్ నూటపదకొండుకి ఈ రోజే రావలసింది'-



పేపరు మడిచేసి విసనకర్రలా విసురుకుంటూ బహు విలాసంగా భార్య వంక చూశాడతను.

"ఖర్మ...ఇది నిన్నటి పేపరు...చూసి మీరెక్కడ పరుగెడతారోనని ఈ పేజీ తీసి దాచేశా...అసలిది ఎలా వచ్చింది బైటికి?" అంటూ ఖంగారుపడిపోయింది నాగమణి.

అవార్డు అందుకోవటానికి మొదటిసారి ఫ్లైట్ ఎక్కితే, వాతావరణం బాగులేనందువల్ల విమానాన్ని వెనక్కి తిప్పేస్తున్నాం అనే అనౌన్స్‌మెంట్ వినిపించినట్టుగా విలవిల్లాడిపోయాడు సుందరాచార్య.

"ఓసి భర్తృ ద్రోహీ...నీ పాపానికి నిష్కృతి నహీ..." అని శపించేసి "ఈ పాటికి ఆ దర్శకులు రూమ్ ఖాళీ చేసి ఎళ్ళిపోయారో ఏంటో" అంటూ చెప్పులు తీసుకొని అందులో కాళ్లుపెట్టి పరుగెడదామని చిన్న ప్రయత్నం చేశాడు. అది విశ్వప్రయత్నంగా మార్చినా సరే ఉపయోగం కనిపించలేదు. అప్పటికే ఆమె చేతులు అతగాడి కాళ్ళని చుట్టేసుకొని ఉన్నాయి.

అప్పటికీ "నాగమణీ...దయచేసి చెప్పకు ఆగమనీ"అని గర్జించాడు కూడా. కంఠస్వరం సమయానికి సహకరించక కీచుగా వచ్చింది సౌండు.

"ఏవండీ....ప్లీజండీ...ఇప్పటికే మీరు రాసిన కథలు చదివి ఇద్దరు ఎడిటర్లు ఆ పత్రిక్కి రిజైన్ చేసి వెళ్ళిపోయారు. తెలీక ప్రింటింగ్‌కి ఇచ్చేసిన సబ్‌ఎడిటర్ ఉద్యోగం ఒక్కవారంలోనే సర్క్యులేషన్ విపరీతంగా తగ్గిపోయినందుకు హుష్‌కాకి అయిపోయింది. మనచుట్టుపక్కల వాళ్ళంతా ఇళ్ళు ఖాళీ చేసేసి వెళ్ళిపోతున్నారు. పాలవాడు, కూరలవాడు ఈ వీధిలో అడుగు పెట్టడానికీ హడలిఛస్తున్నారు. ఇంకొన్నాళ్ళు పోతే మనిద్దర్నీ ఈదేశం నుంచే వెలేస్తారేమోనని భయంగా ఉందండీ... దయచేసి వెళ్ళకండీ"అంటూ ప్రాధేయపడసాగిందామె.

కానీ వినిపించుకునే మూడ్‌లో లేడతను. "హుం..వెలేస్తారా? అలా వెలేసిన వారి చేతే వారి ముక్కుల మీద వేలేయిస్తా...ఈ ఛాన్స్ క్లిక్ అవనీ... దెబ్బకి దద్దరిల్లిపోతుంది ఈ అవని" అన్నాడు భవిష్యత్తులోకి చూస్తున్నట్టు లుక్స్ ఇచ్చేసి.

"ఈలోగా నేనయిపోతాను అవ్వని" అందామె చేసేదిలేక కళ్లొత్తుకుంటూ.

ఆ అవకాశం చాలతనికి. వెంటనే

కాళ్ళు వెనక్కి లాగేసుకొని చెప్పుల్లో పెట్టేశాడు.

"పోనీ...అక్కడ మామూలుగా మాట్లాడతానని, ప్రాసలు అస్సలు వెయ్యనని ప్రామిస్ చెయ్యండి" వేడుకుందామె మంగళసూత్రాలు చూపిస్తూ.

వేదాంతిలా నవ్వాడు సుందరాచార్య. "పిచ్చి నాగమణీ! ప్రాస నా కవిత్వరక్తానికి ధమని....అయినా నేనేమైనా ఆ ప్రాసని పిలుస్తానా రా రమ్మని...దానంతటదే వచ్చేస్తుంది ఝూం ఝుమ్మని...అయినా అడిగావు కనుక ప్రయత్నిస్తా...ప్రస్తుతానికి నిష్క్రమిస్తా... తిరిగొస్తున్నపుడు తీసుకొస్తా...నీకొక రూపాయిల బస్తా" అంటూ రెండు అడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు తన షర్టుని లాగినట్టనిపించి.

"మరి ఆఫీసు?" అంది నాగమణి లేచి నిల్చొని.

ఆమె అమాయకత్వానికి నవ్వొచ్చిందతనికి. "హు హు హు హు...ఆఫీను...!? అని అడిగాడు నమ్మకం చాలక. అవునన్నట్టు తలూపిందామె. "ఆఫీసు...కళాజీవితం అనే నా డ్రాయింగ్ రూమ్ లో ఓ చిన్న షోపీసు...దాని గురించి ఆలోచించి పాడు చేసుకోకు మెంటల్‌పీసు" అంటూ నిష్క్రమించీగా బైటికి నడిచాడు సుందరాచార్య.

* * *

"లోపలకు రావొచ్చాసార్"

తదేక దీక్షతో ఫారిన్ ఛానల్స్ చూస్తున్న అంకుశం,పరాంకుశం తుళ్ళిపడ్డారు.

"పూర్తిగా వచ్చేసి, రావొచ్చా అని అడుగుతారేంటి....రండి కూర్చోండి"అన్నారు.

"తలుపు తెరుచుంది కదాని బెల్లు కొట్టలేదండీ...నిజానికి బెల్లుకొడితే ఇంకా ఎక్కువ తుళ్ళిపడి ఉండేవారు"అన్నాడు సుందరాచార్య వారిని ఆపదని తప్పించేసినవాడిలా వీరనవ్వులు చిందిస్తూ.

"మీరు?"

"రచయితని...మీ ప్రకటన చూసివచ్చా"

"అది నిన్న మాత్రమే కలుసుకోమని ఇచ్చాం కదా?"

"నేనా పేపరు చూసింది ఇవాళే కదా?!"

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు అంకుశం, పరాంకుశం.

"అంటే విషయసేకరణ విషయంలో మీరు ఒకరోజు లేటుగా ఉన్నారన్నమాట"

చెక్కుచెదరలేదు సుందరాచార్య "నీవెక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు అని అన్నాడో తెలుగుకవి. బెటర్ లేట్‌దెన్ నెవర్ అని అన్నాడింకో ఇంగ్లీషుకవి. అంచేత నా అదృష్టాన్ని పరీక్షించుకుందామని వచ్చా. రూమ్ ఖాళీ చేయకుండా మీరింకా ఉండటం నా అదృష్ట సోపానానికి తొలిమెట్టుగా అనిపించింది" అన్నాడు.

"ఓహ్ అదా.... మా ఫ్లయిట్ ఇవాళ కాన్సిల్ అయింది. సరే కూర్చోండి...నా పేరు అంకుశం. ఇతను పరాంకుశం...మీ పేరు?"

"మచిలీపట్నం సుందరాచార్య"


"విచిత్రంగా ఉందే పేరు?" అన్నాడు పరాంకుశం.

"దానికో కథ ఉందండీ...మా స్వస్థలం బందరు. ఆచార్య ఆత్రేయ అన్నా, వేటూరి అన్నా నాకెంతో ఇష్టం. అందుకే వాళ్ళిద్దరి పేర్లూ, మా ఊరిపేరు కలిపి కలిసొచ్చేట్టుగా ఆచార్య బందర్రామ్మూర్తి అని పెట్టుకొన్నా. కానీ కొందరు అకృతార్థులు, ఆపేరుకి విశృతార్థాలు తీసి వెకిలి చేస్తూ ఉంటే చూసి సహించలేక మచిలీపట్నం సుందరాచార్యగా మార్చుకున్నా"

"బావుంది మీ పేరు వెనకే ఇంత కథ ఉంటే మీరు చెప్పబోయే కథ ఇంకెంత ఉంటుందో?" అన్నాడు అంకుశం ఆశగా.

"ఖచ్చితంగా చాలా ఉంటుంది. ఇంతకీ మీకెలాంటి కథ కావాలి?"అడిగాడు సుందరాచార్య శ్రీకృష్ణదేవ రాయలులా.

"బూతుకథలు,వయొలెన్స్ కథలు, సమాజానికి



చెడు చేస్తాయి. ప్రేమకథలు, పెళ్ళికథలు తెగ వచ్చేస్తున్నాయి. మన సినిమా పూర్తయ్యేసరికి అవికూడా బోరు కొట్టేస్తాయి. అంచేత సస్పెన్స్ కథ ఒకటి ట్రై చేద్దాం అనుకుంటున్నాం. మీ దగ్గరేమైనా ఉందా?"

"లేకేం తప్పకుండా ఉంటుంది. కాకపోతే పౌరాణికాలు తీసే ఉద్దేశం లేదా మీకు?"

"ముందు అనుకున్నది కానివ్వండి"అన్నాడు పరాంకుశం 'పాయింట్లోకి రా'అన్నట్టుగా.

"పోనీ పౌరాణికాల్లో సస్పెన్స్ పెట్టి చూడండి. నావెల్టీగా ఉంటుంది"అన్నాడు సుందరాచార్య అదిరిపోయే అయిడియా ఇచ్చినవాడిలా కళ్ళెగరేసి కాలరు సర్దుకొంటూ.

అతడు ఊహించినట్టుగానే వాళ్ళిద్దర్లోనూ ఒకేసారి జర్క్ వచ్చింది.

"ఇతగాడి దగ్గరేదో అద్భుతమైన స్టోరీయే ఉన్నట్టుంది. పౌరాణికాల్లో సస్పెన్స్...ఎంత నావెల్ థాట్?" అనుకుంటూ "మీ కథ వినడానికి మేం రెడీ...ఇక కానివ్వండి"అన్నారు.

"ఆహా ఏమి నాభాగ్యం...ఇక వదిలిపోతుంది ఇండస్ట్రీలో భావదారిద్ర్యవైరాగ్యం..."అన్నాడు సుందరాచార్య ఆపుకోలేని ఎమోషన్‌తో. అంతలో భార్యకిచ్చిన మాట గుర్తుకొచ్చింది. ఎందుకైనా మంచిదని "ఎలా ఉంది సార్ నా ప్రాస?"అని అడిగాడు.

"మీకు ప్రాస అంటే మోజా?"

"మోజా? వాక్యానికో ప్రాస పడకపోతే ప్రాణం జిలార్చుకుపోతోందండి"అన్నాడు నిజం చెప్పేస్తూ.

"మరింత సేపు బాగానే మాట్లాడేరుగా?!"

"అది నా భార్యకిచ్చిన మాటకు కట్టుబడి...కానీ మీరు ఇచ్చిన ప్రోత్సాహమే నా ప్రాసకు ఇపుడు పెట్టుబడి"

"వీలైనంత వరకు ప్రాసలు తగ్గించి చెప్పండి" అన్నారు అతని సంగతి తెలియక.

"అసలు నాకు చిన్నపుడు మా అమ్మ చ్యవన ప్రాశ పట్టినప్పట్నించీ అలవాటండీ ఈ ప్రాస" అన్నాడు సుందరాచార్య రెచ్చిపోతూ.

"మీరు ఆస్మా పేషెంటా?"

"అవునండీ...అస్తమానం ఆస్మాతో బాధపడే వాణ్ణి చిన్నప్పుడు. అందుకే నాకు అన్నప్రాశన కంటే ముందు చ్యవనప్రాశే చేశారు"

బిక్కచచ్చిపోయారు అంకుశం పరాంకుశం.

"త్వరగా కథను చెప్పండి ప్రాసలకు గ్యాపిచ్చి...

లేకుంటే ఎక్కుతుంది మాకు తిరుగులేని పిచ్చి" అన్నారు ఇంకెలా ముందుకెళ్ళాలో తెలీక.

"ఆహా...మీరు కూడా ప్రాసలు అద్భుతంగా వేస్తున్నారే" అంటూ పరవశించిపోతున్న సుందరాచార్య నిలువుగుడ్లేసుకొని చూస్తున్న వారిద్దర్నీ గమనించి కథ చెప్పే మూడ్‌లో కొచ్చేశాడు.

"ఇంతకూ సస్పెన్స్ కథ కావాలన్నారు కదూ... చచ్చు పెన్నులు ఊహించలేని సస్‌పెన్స్‌కథ, అందరికీ తెలిసిన కథ చెప్తా వినండి"అన్నాడు.

"అందరికీ తెలిసిన కథా....అదేంటి?"

"వినాయకుడి కథ"

"వినాయకుడి కథా!? అందులో ఏవుందీ సస్పెన్సు!?"

"లేకేం బోలెడంత ఉంది....పార్వతీదేవి స్నానం చేస్తూ వినాయకుణ్ణి కాపలాపెడుతుంది కదా. అప్పుడే వచ్చిన శివుడికి ఇతగాడు ఎవరా అన్నది సస్పెన్స్...తల్లి స్నానం చేస్తుంటే లోపలికి వెళ్ళానంటున్న ఈ వ్యక్తి ఎవరా అన్నది వినాయకుడికి సస్పెన్స్"

నిలువుగుడ్లు గుండ్రంగా తిరగటం మొదలు పెట్టాయి. అంకుశం,పరాంకుశంకి. అవేవీ గమనించే పరిస్థితిలో లేడు సుందరాచార్య.


"వచ్చినవాడు కాస్సేపు వెయిట్‌చెయ్యకుండా తన కొడుకు తల ఎందుకు నరికేశాడా అన్నది పార్వతీదేవికి సస్పెన్స్. ఏ తల తీసుకువచ్చి బ్రతికిస్తాడా అన్నది నందికి,భృంగికి సస్పెన్స్...ఎవరు ఉత్తరాన తలపెట్టుకొని పడుకొని ఉంటారా అన్నది వెతుకుతున్న తక్కిన ప్రమథగణాలకి సస్పెన్స్...కావాలంటే ఆ సీన్లో 'ఉత్తరానా ఊరవతలా' అనే పాటని బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌గా వాడుకోవచ్చుకూడా"అంటూ ఓ ఉచిత సలహా పారేశాడు.

"పౌరాణిక చిత్రానికి సాంఘిక చిత్రంలోని పాట

బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌గా పెట్టడం ఏవిటండీ?"

"అదేనండీ నావెల్టీ... ఏం చెప్తున్నానూ...ఆ... య్యస్...గుర్తుకొచ్చింది. చంద్రుడు నవ్వడంతో తర్వాత ఏం జరుగుతుందా అని దేవతలకి సస్పెన్స్...తను పొందిన శాపానికి తరుణోపాయం ఏవిటా అన్నది చంద్రుడికి సస్పెన్స్...ఆ తర్వాత చంద్రుణ్ణి పాలలో చూసిన శ్రీకృష్ణుడికి ఏ ఆపద రానున్నదోనని రుక్మిణీదేవికి సస్పెన్స్"అంటూ ఊపిరి తీసుకోడానికి ఆగాడు సుందరాచార్య.

"ఇంకా ఉందా అండీ సస్పెన్స్"అని అడిగారా ఇద్దరూ దొరికిన ఆ కాస్త గ్యాప్‌లో.



"టెన్షన్‌గా ఉందాం డీ?"

కాదంటే ఇంకెలా ప్రొసీడవుతాడో తెలీక ఔనని తలూపేశారు ముందు జాగ్రత్త చర్యగా.

"చూశారా చూశారా ఇన్ని సినిమాలు తీసిన మీరే ఇంత టెన్షన్ ఫీలయిపోతుంటే ఇక ఆడియన్స్ సంగతి చెప్పాలా...అన్నట్టు ఎంత వరకూ చెప్పాను...ఆ... మళ్ళీ గుర్తుకొచ్చింది... తనకు శమంతకమణిని సత్రాజిత్తు ఎందుకు ఇవ్వనన్నాడో శ్రీకృష్ణుడికి సస్పెన్స్...ఆ మణిని ధరించి వెళ్లిన ప్రసేనుడు ఏవయ్యాడోనని సత్రాజిత్తుకి సస్పెన్స్...పోయిన ఆ శమంతకమణి జాడ తెలిసేవరకు వెదుకుతోన్న భటులకి సస్పెన్స్...శ్రీకృష్ణుడు, జాంబవంతుడు పోరాడుతూ ఉంటే అది ఎప్పుడు ముగుస్తుందోనని జాంబవతికి సస్పెన్స్...తానెందుకు ఓడిపోతున్నాడో తెలుసుకోలేని జాంబవంతుడికి శ్రీకృష్ణుడే శ్రీరాముడని తెలిసేవరకూ సస్పెన్స్...ఇలా అడుగడుగునా సస్పెన్స్‌తో ఉన్న వినాయకుడి కథ కన్నా సస్పెన్స్ ఉన్న పౌరాణిక కథ ఏముందండీ? చెప్పండి" అన్నాడు సుందరాచార్య సోఫాలో వెనక్కి చేరబడి.

"మేం అడిగింది పాత్రలు సస్పెన్స్‌లో పడిపోయే కథ కాదండీ...ప్రేక్షకుల్ని సస్పెన్స్‌లో ముంచే కథండీ"

"నా కర్థం అయిందండీ....శ్రీకృష్ణుడు దేవుడు కాబట్టి అలాంటి నీలాపనింద నుంచి బైటపడ్డాడు. మరి సామాన్య మానవుడి గతి ఏంటీ? అనే సస్పెన్స్‌తో బైటికొస్తాడండీ ప్రేక్షకుడు. అది చాలదుటండీ వాడికి!?"

"మీరు సాంఘిక సస్పెన్స్‌లు చెప్పలేరాండీ?" అడిగారా ఇద్దరు ఆఖరి ఆశతో.

"లేకేం అండి...ఈ కథనే మనం సాంఘికం చేసుకోవచ్చు. పార్వతి స్నానం చెయ్యబోతుంటే తొంగిచూడబోతాడు శివరావు. 'అదేం బుద్ధి నానా' అంటాడు గణేష్. 'నీకెందుకు నోర్ముయ్' అంటూ ఒక్కటిచ్చుకొంటాడు శివరావు. తూలిపడిపోయిన గణేష్‌కి స్టూల్‌మీదున్న మేకు గుచ్చుకొని ముఖం చీరుకుపోతుంది. ఆ తర్వాత అష్టకష్టాలుపడి అతని ముఖానికి ప్లాస్టిక్‌సర్జరీ చేయిస్తాడు శివరావు. దాంతో అతన్ని గుర్తుపట్టడం కష్టం అయిపోతుంది. అటువంటి గణేష్ అందరిచేతా ఎలా శభాష్ అనిపించుకుంటాడా అన్నదే మెయిన్ సస్పెన్స్ అన్నమాట...కావాలంటే ఇలాగ కూడా మార్చుకోవచ్చండీ...ఎలా ఉందండీ?" అని అడిగాడు సుందరాచార్య ముఖం నిండా కుతూహలం ఎక్స్‌ప్రెషన్‌ని గుప్పించేస్తూ.

అంతవరకు రకరకాల షాక్‌లకి అలవాటుపడ్డ అంకుశం పరాంకుశంకి ఆఖరి ఆశ అడుగంటిపోయినందుకు బాధ కలగలేదు. సుందరాచార్య గురించి మనసులో చూచాయగా ఏర్పడిన అభిప్రాయం కన్ఫర్మ్ అయిపోయినందుకు ఓ రకంగా ఆనందంగా కూడా ఉంది. ఇక తప్పించుకోవటమే తక్షణ కర్తవ్యం అని నిర్ధారించేసుకొని "పవిత్రమైన ఒక పౌరాణిక కథని ఇలా మార్చుకోవచ్చని ఇన్నేళ్ళ మా సినిమా అనుభవంలో మాకు తట్టని విషయం సుమండీ...ఇన్నాళ్ళకు మాకు జ్ఞానోదయం అయింది"అన్నారు.

"థాంక్సండీ...మీరైనా గుర్తించారు నా ప్రతిభని" అన్నాడతను పొంగిపోతూ...కాస్సేపాగి "ఇంకోటుందండీ"అన్నాడు ఇదే ఛాన్సని.

"ఇంకో కథా!?"

"కథ కాదండీ...విషయం అండి...ఒకప్పుడు మన సినిమాల్లో మాటలు, పాటలు ఒకరే రాసేవారు. ఇప్పుడు మాటలు ఒకరు పాటలు కొంతమందీ రాస్తున్నారు. కథ,మాటలుతో పాటు పాటలు కూడా నేను రాస్తే మళ్ళీ పాతరోజుల్లోని స్వర్ణయుగాన్ని ప్రేక్షకులకి అందించిన వాళ్ళవుతారు మీరు"

"మీరు పాటలు కూడా రాస్తారా?"అదిరిపడ్డారా ఇద్దరూ కొత్తరకం షాక్‌కి.

"ట్యూనిస్తే!?"

"హమ్మయ్యా...ట్యూనిప్పుడు లేదుగా...అయినా ట్యూన్ ఇవ్వడం మ్యూజిక్ డైరెక్టర్ పని. మా పనికాదు..."అన్నారు వంతులవారీగా.

"నాకు తెలుసండీ...అందుకే నాకు బాగా వచ్చిన ట్యూన్‌కే సాహిత్యం రాసేసుకుని తెచ్చా. నేనే పాడి వినిపిస్తా...వినండి" అన్నాడతను పట్టువదలని విక్రమార్కుడిలా.

"ఇదే లాస్ట్ కదా...మాటివ్వాలి మరి"అన్నాడు అంకుశం చిలిపిగా చేయిచాస్తూ.

"ఓయ్యస్...ఆ విషయంలో నో ప్రాబ్లెమ్...ఏదో హడావుడిగా బయలుదేరటంతో ఇంతకు మించి ఇవాళ్టికి నా దగ్గర స్టాకు ఏదీ లేదు కూడా..."

"అయితే కానీండి మరి" అన్నాడు పరాంకుశం హుషారుగా మనసులో బతుకుజీవుడా అనుకుంటూ.

"ఒరిజినల్ పాట వేటూరి సుందరరామ్మూర్తిగారు రాసిందండి. 'కలికి చిలక చలికి దరికి చేరగనే' అంటూ మొత్తం పల్లవి అంతా 'ల'కారాలతోనే రాశారండీ...అంతకు ముందు ఆత్రేయగారు 'రేకంటి రూపం కంటి'అంటూ అన్నీ 'ట'కారాలతో ఓ పాట రాశారండీ...వాళ్ళిద్దరి ఇన్‌స్పిరేషనే కదండీ నాకు. అందుకని 'కలికి చిలక' పాట ట్యూన్‌లో అన్నీ 'ర'కారాలతోనే రాశానండీ ఈ పాట" అన్నాడు జేబులోంచి పాట కాగితం తీస్తూ.

" 'ర'కారాలతోనా?"

"అవున్సార్ కొత్త ప్రయోగం ఇది....
గుర్రమల్లె గుర్రుపెట్టి చూడకుమా
తొర్రలోన చిర్రుబుర్రులాడకుమా
ఎర్రగున్న కుర్రపిల్ల సర్రుమన్నది
జుర్రుకున్న కుర్రతనం వర్రగున్నది
తుర్రుమంటె హుర్రే హుర్రే హుర్రే"

ఇంకా చరణాలు పాడాలనుకొని వాళ్ళిద్దరి వంకా చూశాడతను. పరాంకుశం బాత్‌రూమ్‌కి వెళ్లివచ్చినట్టున్నాడు. అంకుశం మాత్రం ఫ్రిజ్‌లో పెట్టేసినట్టు ఫ్రీజ్ అయిపోయాడు. సదరు భంగిమ అర్థంకాక "సార్...సార్...మళ్ళీ తన్మయత్వంలోకి వెళ్ళిపోయారా?"అని అడిగాడు.

"అసలు మాకొక తనువుందన్న సంగతే మర్చిపోయాం. అప్పుడే స్వర్గానికి వెళ్ళిపోయాం అనుకున్నాం"

"థాంక్యూ సార్...థాంక్యూ"అన్నాడు సుందరాచార్య ఉప్పొంగిపోతున్న ఆనందాన్ని వినయంతో కప్పేయడానికి ప్రయత్నిస్తూ.

"ఖర్మ...వీడికి వ్యంగ్యం,వెటకారం లాంటివేవీ తెలిసినట్టు లేవు"అని మనసులో అనుకొని "తొర్రలో చిర్రుబుర్రులాడటం అంటే ఏవిటి గురూగారూ?"అడిగాడు

అంకుశం.

"అబ్బే...దానికే అర్థమూ లేదండీ...అయినా యుగళ గీతాల్లో కొన్ని మాటలకి ఈ కాలంలో ఏ అర్థమూ ఉండకూడదండీ. ఉండదు కూడా"అన్నాడు సుందరాచార్య వారి అజ్ఞానానికి జాలిపడుతూ.

"అయితే అంతా అనర్థమే అన్నమాట...మరి జుర్రుకున్న కుర్రతనం వర్రగుండడం ఏంటండీ?" అడిగాడు పరాంకుశం బహు అమాయకంగా.

"అది మా గురువుగారు ఆత్రేయ టైప్‌లో కొట్టా"

"పోదురూ బడాయి...ఇంత చిన్నముక్కకి మద్రాసుకెళ్ళి ఆత్రేయగారింట్లో టైప్‌రైటర్ తీసుకొని కొట్టాలటండీ? ఈ ఊళ్ళో తెలుగు టైప్‌రైటర్లే లేవా...మరీ చోద్యం కాకపోతే..."అన్నాడు అంకుశం.

"ఏంటో...డైరెక్టర్‌గారు తెగ కార్టూన్ లేసేస్తున్నారు" అన్నాడు సుందరాచార్య.

"ఓహో దీన్ని కార్టూన్ అంటారా...!? సరేగాని...మాకిప్పుడే ఓ బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది" అన్నాడు పరాంకుశం.

"ఏదీ...నన్ను చూశాక, నా కథా, మాటలు, పాట విన్నాక...అంతే కదూ!?"

"ఎగ్జాట్లీ"

"థాంక్యూ...థాంక్యూసర్...ఇంతకీ ఏంటండీ ఆ అయిడియా"

"మన సినిమాల్లో హీరోలకి హీరోయిన్‌లకి కాస్ట్యూమర్లు, బ్రెయిన్ ట్యూమర్లు ఉంటారు కదండీ...."

"బ్రెయిన్ ట్యూమర్లు ఎవరండీ?"అడిగాడు సుందరాచార్య ఆశ్చర్యంగా.

"ఓహ్...అదా...మీ ప్రభావం మా వాడి మీద పడింది లెండి. అందుకే కొత్తకొత్త పదాలు సృష్టించేస్తున్నాడు. మావాడి ఉద్దేశం కాస్ట్యూమర్లు, హెయిర్ డ్రెస్సర్లు అనీ"అని సర్దేశాడు పరాంకుశం.

"ఆ...కరెక్ట్...అలా కాస్ట్యూమర్లు, హెయిర్ డ్రెస్సర్లు ఉన్నట్టే ప్రత్యేకంగా హీరో గారి డైలాగులకి మాత్రం స్పెషల్‌గా ఓ రైటరుంటే ఎలా ఉంటుంది?"అన్నాడు అంకుశం అందిపుచ్చుకొని.

"అదరహో అదరహో"

"అదురుతుంది కదా...అంచేత మేం తీయబోయే పిక్చర్లో ఫస్ట్‌హాఫ్‌లో...అంటే...ఇంట్రవెల్‌దాకా మా హీరోకి- మాటలు,పాటలు...మీరే..."

"వాహ్...అదుర్స్...కానీ ఇంట్రవెల్ దాకానే ఎందుకండీ...మరీ ఆ తర్వాత...!?"

"దానికి ఇంకో రైటర్‌తో రాయించుకుంటాం...ఇద్దరుంటే పోటీపడి రాయొచ్చు. హీరోగారు కూడా సంతోషించి కాల్‌షీట్‌లు బాగా ఎడ్జెస్ట్ చేస్తారు. మీలో టాలెంట్ ఉంటే భవిష్యత్తులో ఇద్దరు ముగ్గురు హీరోలకి పర్మనెంట్ రైటర్‌గా సెటిలయిపోవచ్చు కూడా"అన్నాడు అంకుశం డ్రీమ్ సీన్‌కి సూచనలా చూపుడు వేలితో సర్కిల్స్ చుట్టేస్తూ.

సుందరాచార్య కూడా ఇంచుమించు సగం దూరం వెళ్ళిపోయాడు కలల్లోకి.

"సార్...గురూగారూ...ఇంటికెళ్ళి మాటలు, పాటలు ఆలోచించండి సార్" అంటూ తట్టిలేపాడు పరాంకుశం.

"కరెక్టే...ముందాపని చెయ్యాలి కదా... ఏవిటో నన్ను మరీ మొహమాట పెట్టేస్తున్నారు...ఇంతకీ స్టోరీ ఫైనలైజ్ చేసుకోలేదు మనం" అన్నాడతను.

"ఆ...అదే...మీ ప్రతిభ గమనించాక పౌరాణిక సినిమా,సస్పెన్స్ సినిమా అన్నీ వాయిదా వేసేసుకొని వీరప్పన్ తిరిగే అడవుల్లాంటి అడవుల్లో ఓ జంగిల్ సినిమా తియ్యాలనే అయిడియా వచ్చింది నాకు" అన్నాడు అంకుశం.

"అలా అయితే పెద్ద హీరో డేట్‌లు నా దగ్గరున్నాయి. ఆ హీరో ఎవరో క్లాప్ కొట్టే రోజే ప్రకటిస్తా. అయ్యా సుందరాచార్యగారూ... మన సినిమా కన్ఫర్మ్‌డ్...టార్జాన్ సినిమా నిజమైన అడవుల్లో పెద్ద హీరోతో తీస్తున్నాం. ఫస్ట్‌హాఫ్ వరకు హీరో గారికి మాటలూపాటలూ ఊహించేసి, రాసేసి సిద్ధం చెయ్యండి. నెలరోజుల్లో మీ ఇంటికొచ్చి మీ డబ్బులు మీకిచ్చేసి మా స్క్రిప్ట్ మేం పట్టుకుపోతాం...ఏంటీ...ఓకేనా?"అన్నాడు పరాంకుశం ఆలోచించడానికి అవకాశం ఇవ్వకుండా.

"ఓకేనా అని అడుగుతారేంటండీ...అది ఒకే కాదు నా పాలిట పూల బొకే"అన్నాడు సుందరాచార్య ఆవేశంతో ఊగిపోతూ

"సార్సార్...ప్రాసలతో సహా ఇంటికెళ్ళి ఆలోచించండి సార్...ప్లీజ్" అంటూ అతణ్ణి ఆటో ఎక్కించేసి అయిదు నిముషాల్లో హోటల్‌రూమ్ ఖాళీచేసేసేరు అంకుశం-పరాంకుశం.

* * *

ఎవరో పిల్లిలా నడుస్తూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళినట్టుగా అనిపించి వంటింట్లోంచి వచ్చి చూసింది నాగమణి.

మంచం మీద విష్ణుమూర్తి ఫోజులో పడుకుని ఉన్నాడు సుందరాచార్య.

"రా...నీకోసమే చెప్పులోంచి కాళ్ళు తీసి రెడీగా ఉంచాను" అన్నాడు ఆమెను చూసి.

"ఎందుకు?"అందామె ఆశ్చర్యంగా.

"ఎందుకేవిటి...పెళ్ళానివికదాని ఫస్ట్ ఛాన్స్ నీకిస్తుంటే...!? రేపట్నించి అందరూ నాకు పాదాభివందనం చేస్తూ ఉంటే కళ్ళకద్దుకోడానిక్కాదు కదా కనీసం చూడ్డానిక్కూడా ఛాన్సు దొరకదు నీకు. ఆలోచించుకో...ఒకటవసారి పాదాలు రెడీ...రెండవసారి...ఆలసించిన ఆశాభంగము...మూడోస్సారి..." అంటూ చెలరేగిపోతున్నాడతను.

"ఎంత అమాయకులండీ?"అందామె జాలిగా చూసి.

"ఆ మాట నేననాలి నిన్ను చూసి...అసలు విషయం తెలిస్తే నువ్విలా అనవు బ్రహ్మరథం పడతావు"అంటూ జరిగింది మొత్తం ఆడియో క్యాసెట్ పెట్టేశాడు.

"అందుకే అన్నాను మిమ్మల్ని అమాయకులని" అందామె.

"అద్గో మళ్ళీ అదేమాట"

"ఏం చెయ్యను మరి...మా కింకా అర్థం కాకపోతే...టార్జాన్ సినిమాని ప్రపంచంలో ఏ భాషలో తీసినా ఇంట్రవల్ వరకు హీరోకి అరుపులు తప్ప ఒక్క డైలాగు కూడా ఉండదు. ఇంక మీరేం రాస్తారు మాటలూ....పాటలూ...?"

గుండెలో చిన్న కుదుపు వచ్చినట్టు ఒక్కసారిగా ఊగి ఆగిపోయాడు- షాక్‌లు ఇవ్వడమే తప్ప తీసుకోవటం తెలియని- సుందరాచార్య.

తనని ఈ పద్ధతిలో బురిడీ కొట్టించి బైటికి పంపించాలనే ఊహ వాళ్ళకి ఎలా వచ్చిందా? అని ఆలోచించసాగాడు. పరాంకుశం బాత్‌రూమ్‌కని రూమ్‌లోంచి బైటికి వెళ్ళడం గుర్తుకొచ్చింది. ఆ టైమ్‌లో ఎవరైనా ఫోన్‌చేసి వాళ్ళకి చెప్పే అవకాశం ఉంది. కానీ ఎవరికంత అవసరం...?

"వాళ్ళకి ఫోన్‌చేసి మాట్లాడేవుకదూ?"అడిగాడు కోపంగా భార్యని చూస్తూ.

అవునన్నట్టు తలూపిందామె.

"నీకేం ద్రోహం చేశానని ఇలా వెన్నుపోటు పొడిచావు...నేను పైకిరావటం నీకిష్టం లేదా?"

ఆమె ధైర్యంగా తలెత్తి అతని కళ్ళలోకి చూసింది "ఇష్టం కాబట్టే ఇలా చేశాను"అంది.

ఆవేశాన్ని అవమానంతో కలిపి హరాయించుకోడానికి చేస్తున్న ప్రయత్నంలో అర్థం కాలేదతనికి.

"నా మనసులో మాట చెప్తాను....మరోలా అనుకోకండి...ఉన్న ఉద్యోగం సక్రమంగా చేసుకోకుండా రోజూ వెళ్ళి సంతకాలు పెట్టేసి స్టూడియోల చుట్టూ,సినిమా వాళ్ళ చుట్టూ తిరగడం, లేకపోతే జీతం నష్టం మీద ఇంట్లో కూర్చొని ఎవ్వరూ మెచ్చుకోలేని రాతలు రాయటం, అవేవీ గ్రహించుకోలేక మీ భ్రమల్లోనే మీరు బతికేస్తూ అందరూ మీ గురించి వెకిలిగా మాట్లాడుకునే అవకాశాన్ని ఇవ్వటం ఇవన్నీ నాకెంత బాధ కలిగిస్తున్నాయో తెలుసా? నిజంగా మీరాసేవన్నీ అంత గొప్పవే అయితే, మీమీద మీకున్న నమ్మకమే కరెక్ట్ అయితే మనకు తిండిపెట్టే ఆఫీసునెందుకూ మోసం చెయ్యడం? రిజైన్ చేసేసి బైటికి వచ్చి మీ శక్తిని నిరూపించుకోండి. నిజంగా అవసరం ఉన్న వాడికైనా ఓ ఉద్యోగం దొరుకుతుంది. ఇలా మోసం చేస్తూ సంపాదించి తినే తిండివల్ల కలిగే ఆలోచనలు సత్ఫలితాలను ఇస్తాయా చెప్పండి...!?" అడిగిందామె ఎంతో సౌమ్యంగా.

వెయ్యిగొంతులు వెర్రిగా ఘోషిస్తూ చేసే రాద్ధాంతాలకు లేని శక్తి మృదువుగా చెప్పే ఒక్క మాటకి ఉంటుంది.

సమయాన్ని గుర్తించి సందర్భాన్ని బట్టి వివేకాన్ని పదునుపెట్టగల విచక్షణకుండే బలం అలాంటిది. మొదటిసారి అనుభవపూర్వకంగా ఆ విషయం అవగాహన అయిందతనికి.

"ఈ యాంగిల్‌లో నేనెప్పుడూ ఆలోచించలేదు...సారీ"అన్నాడు ఓ అరగంటపాటు మౌనంగా హృదయంతో సాగిన ఘర్షణ తరువాత.

"నాకు తెలుసు...అందుకే మిమ్మల్ని అమాయకులు అని అన్నాను" అందామె తేటపడిన మనసుతో.

"ఇంకానయం...చెడ్డవాణ్ణి అనుకోలేదు"

"అలా అనుకొని ఉంటే ఇంత బాధపడతానా?"

"మరేం చేసేదానివి?"

"మీ ఆఫీస్‌కి వెళ్ళి కంపాష్యుయేట్‌గ్రౌండ్స్ కింద మీ ఉద్యోగం నాకు ఇమ్మని లెటర్ పెట్టేదాన్ని"

"ఏయ్...తెలిసే మాట్లాడుతున్నావా...భర్తపోతేనే కంపాష్యుయేట్ గ్రౌండ్స్ కింద భార్యకిస్తారు ఉద్యోగం..."

"పోతేనే కాదు...పట్టించుకోకపోతే కూడా...అంటూ రూల్సు మార్చాలని లెటర్స్ మీద లెటర్స్ పెడతా" అందామె సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ.

"బాబోయ్!

అంతకన్నా ఈ ట్రీట్‌మెంటే బావుంది"అన్నాడతను రెండుచేతులూ ఎత్తి దండం పెట్టేస్తూ.